# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యోగా సంస్కృతిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర అభియాన్‌ను ప్రారంభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21 వరకు 100 పర్యాటక ప్రదేశాలతో సహా యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్.. అనేక రంగాల్లో వృద్ధి సాధించిందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.
- ❖ "జల్‌జీవన్ మిషన్" లో భాగంగా ప్రతి ఇంటికి నీరు ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

====================

రాష్ట్రంలో యోగా సంస్కృతిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "యోగాంధ్ర అభియాన్"ను ప్రారంభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ రోజు ప్రసారమైన "మన్‌కీ బాత్" కార్యక్రమం 122వ సంచిక ద్వారా ప్రధానమంత్రి తన మనసులో భావాలను దేశ ప్రజలతో పంచుకున్నారు. జూన్ 21న "అంతర్జాతీయ యోగా దినోత్సవా"న్ని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర అభియాన్ ప్రచారం భాగంగా యోగా సాధన చేస్తున్న 10 లక్షల మందితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను చేర్చుకోవాలని.. ఈ సంవత్సరం కూడా ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవం పట్ల ప్రజల్లో ఉత్సాహం స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈసారి యోగా దినోత్సవాన్ని ఆసక్తికరంగా జరుపుకోవాలని నరేంద్ర మోదీ ప్రజలను కోరారు. ఈ సంవత్సరం విశాఖపట్నంలో జరిగే 'యోగా దినోత్సవం' కార్యక్రమంలో తాను పాల్గొంటానని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21 వరకు 100 పర్యాటక ప్రదేశాలతో సహా యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఈ రోజు సామాజిక మాధ్యమ వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోగాంధ్ర-2025 గురించి ప్రస్తావించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ లక్ష్యం కోసం ఐక్యంగా ఉన్నారని గుర్తు చేశారు. యోగాను జీవితంలో అంతర్భాగం చేసుకోవాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జూన్ 21న విశాఖలో ప్రధాన మంత్రికి స్వాగతం పలికేందుకు తాము ఎదురు చూస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

====================

ఈ రోజు మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద మోదీ పలువురు కళాకారులు, కళలు, సృజనాత్మక మహిళలను గూర్చి ప్రస్తావించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీకి చెందిన 65 సంవత్సరాల జీవన్ జోషి కాళ్లకు బాల్యంలో పోలియో సోకినప్పటికి, అతని ఊహా శక్తి, పైన్ చెట్ల ఎండిన బెరడు నుండి అందమైన కళాఖండాలను సృష్టించేలా చేసిందన్నారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలోని మహిళలు డ్రోన్ల సహాయంతో 50 ఎకరాల భూమిలో క్రిమి సంహారకాలను పిచికారీ చేస్తున్నారని ప్రధానమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 35 సెకనన్లు)

====================

గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్.. అనేక రంగాల్లో వృద్ధి సాధించిందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈ రోజు సామాజిక మాధ్యమ వేదికగా తెలిపారు. ప్రపంచంలో భారత్ నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతిఆయోగ్ ప్రకటించడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదని, ప్రపంచంలో నవభారత్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తోందని అన్నారు. మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు, వికసిత్ భారత్-2047 వైపు నడిచేందుకు ఇది ఒక ముఖ్యమైన అడుగని ఉపముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

విరామం

====================

విశాఖపట్నం జిల్లాలో ఈ రోజు యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలను నిర్వహించిన నేపథ్యంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజీ, అక్కయ్యపాలెం కేంద్రీయ విద్యాలయం కేంద్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరు, అభ్యర్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. కేంద్రాల్లో భద్రత, పర్యవేక్షణ, అభ్యర్థులకు తాగు నీరు, విశ్రాంతి ప్రాంతాలు, సూచన బోర్డుల వంటి ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

====================

"జల్‌జీవన్ మిషన్" లో భాగంగా ప్రతి ఇంటికి నీరు ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గంలోని రావెల గ్రామంలో వెనుకబడిన వర్గాల సామాజిక భవన నిర్మాణానికి ఈ రోజు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కేంద్రసహాయ మంత్రి మాట్లాడుతూ.. తాడికొండ నియోజకవర్గంలో మరో రెండు సామాజిక భవనాలు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వెనక్కు మళ్లిన జల్‌జీవన్ మిషన్ నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామని తెలియజేస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

====================

తిరుపతి జిల్లా తిరుపతి నగరంలో తిరంగా ర్యాలీ ఈరోజు ఘనంగా జరిగింది. వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో బాలాజీకాలనీ సర్కిల్ నుంచి నాలుగుకాళ్ళ మండపం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు. విద్యార్థులు, మాజీ సైనికులు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. దేశం కోసం సైనికులు చేస్తున్న త్యాగాలను దేశ ప్రజలు ఎల్లవేళలా గుర్తుంచుకుంటారని ఈ సందర్భంగా శాసన సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నారు.

====================

విశాఖపట్నం  జిల్లా పెదగంట్యాడలోని ఇస్లాంపేటలో నిర్మించిన  వెనుకబడిన తరగతులు వసతి గృహం నూతన భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈ రోజు ప్రారంభించారు. 97 లక్షల రూపాయల కార్పొరేట్ పర్యావరణ నిధులతో ఈ భవనాన్ని నిర్మించగా, అర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహాయాన్ని అందించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల ఉన్నత విద్యకు పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్పొరేట్ సంస్థల నిధులు సామాజిక అవసరాలకు ఉపయోగపడటం శుభపరిణామమని తెలిపారు.

====================

నైరుతి రుతుపవనాలు ఈరోజు పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని,  ఈనెల 27వ తేదీ నాటికి పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని  అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో  నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్న ఫలితంగా రాష్ట్రంలో రేపు, ఎల్లుండి  తేలికపాటి  నుండి  ఒక మోస్తరు  వర్షాలు  లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని  చోట్ల  కురిసే  అవకాశముందని వాతావరణ శాఖ అధికారిణి పేర్కొంటూ...

(వాయిస్ 12 సెకన్లు)

====================
====================